సాక్షి వికారాబాద్

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



దారులతో సతమతం!

దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మారుమూల పల్లెలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. 8లో▸



బాస్కెట్‌బాల్‌లో సత్తా

మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా బాల బాలికల జట్లు సత్తా చాటాయి. 8లో▸



ఖరీఫ్ కళకళ!

ఖరీఫ్ పంటలు కళకళలాడుతున్నాయి. వర్షాలు మోతాదుగా కురిసినా పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. 9లో▸

ఖాళీగా కనిపిస్తే కబ్జా

ఓ వైపు నగరంలోని కబ్జాలపై ప్రభుత్వం కన్నెర్ర చేస్తుంటే.. జిల్లాలో మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. అక్రమార్కులు రెచ్చిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

చెరువులు, కుంటలు, బఫర్ జోన్లను మింగేస్తున్న అక్రమార్కులు

- నాలాలు, వాగులను ఆక్రమించి కంచెలు
- తాజాగా ఎన్మకతల చిన్న చెరువు కబ్జా
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు
- వాస్తవమని తేలినా పట్టించుకోని వైనం

వికారాబాద్: మోమిన్‌పేట మండలం ఎన్మకతల గ్రామ శివారులోని చిన్న చెరువు ఇది. 164 సర్వే నంబర్‌లోని 18 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చెరువు పరిసరాల్లో భూమి కొనుగోలు చేశాడు. అనంతరం చెరువు స్థలంపై కన్నేసి.. బఫర్ జోన్‌ను ఆక్రమించి వంద మీటర్ల మేర నిర్మాణాలు చేపట్టాడు. అంతటితో ఆగకుండా ఎఫ్‌టీఎల్ ఏరియాలోని ఎకరా పొలానికి పైగా ఆక్రమించుకున్నాడు. వేరే ప్రాంతం నుంచి మట్టి తీసుకు వచ్చి చెరువును పూడ్చేశాడు. రికార్డుల్లో 20 మీటర్ల వెడల్పుతో ఉన్న అలుగును సైతం కబ్జా చేసి రాతి కట్టడం నిర్మించాడు. దీంతో అలుగు విస్తీర్ణం నాలుగు మీటర్లకు తగ్గిపోయింది. చెరువులోకి నీరు చేరే ప్రధాన ఆధారమైన ఫీడర్ చానల్‌ను సైతం పూడ్చేశాడు. ఈ చెరువు సమీపంలో సదరు వ్యక్తి కొనుగోలు చేసిన పొలానికి ఆనుకుని నక్ష బాట ఉండగా దాన్ని సైతం కబ్జా చేశాడు. దీంతో మిగిలిన రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండాపోయింది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేయగా వారుకూడా కబ్జాదారులకే కొమ్ముకాశారని రైతులు ఆరోపించారు. దీంతో పొలాలకు దారి చూపాలని కోరుతూ బాధిత రైతులు ఇటీవల కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్, ఇరిగేషన్ ఈఈని ఆదేశించారు. వెంటనే సర్వే చేపట్టిన వారు కబ్జా నిజమేనని, మట్టితో పూడ్చేసి చెరువును కబ్జాకు పాల్పడ్డారని తేల్చారు. కబ్జా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులు మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు కబ్జా నిజమేనని తేల్చి ట్రెంచ్ కొట్టి వదిలేశారు తప్ప చెరువును కబ్జా చెర నుంచి విడిపించలేదు.



చెరువు అలుగు కబ్జా చేసి కట్టిన రాతిగోడ



ఎన్మకతల చిన్న చెరువులో కబ్జాకు గురైన ప్రాంతానికి ట్రెంచ్ కొట్టి వదిలేసిన అధికారులు

అధికారుల అండదండలూ వారికే..?

కబ్జారాయుళ్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, వాగులు, దారులు దేన్నీ వదడం లేదు. చెరువులు కబ్జా చేసి పంటలు పండిస్తున్నారు. అవి తమవే అన్నట్లుగా కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తతంగం అధికారుల దృష్టికి వచ్చినా తాత్కాలికంగా విచారణ పేరిట సందర్శిస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు శిఖాలు, బఫర్ జోన్లను సైతం ఆక్రమిస్తున్నారు. ఈ విషయంలో తహసీల్దార్, ఇరిగేషన్, కలెక్టర్‌కు ఫిర్యాదులు అందినా ఎటువంటి ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కబ్జాలు విడిపించని 'మిషన్ కాకతీయ'

జిల్లా వ్యాప్తంగా 1,196 చెరువులుండగా వాటిల్లో విడతల వారీగా మిషన్ కాకతీయ పనులు చేపట్టారు. ఈ పథకంలో పూడికతీతతో పాటుగా ఎక్కడైనా చెరువులు కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారుల సమన్వయంతో హద్దులు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. కానీ ఈ పనులు చేపట్టిన నీటి పారుదల శాఖ అధికారులు ఏ చెరువులోనూ కబ్జాల జోలికి వెళ్లలేదు.. హద్దులు ఏర్పాటు చేయలేదు. దీంతో కబ్జాల విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. చెరువులు, కుంటలు, దారులు, పానాదులు, నాలాలకు సంబంధించి చాలా చోట్ల రికార్డులు సైతం తారుమారయ్యాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖల వద్ద చెరువులకు సంబంధించిన రికార్డులే కనిపించడం లేదు. కొన్ని చెరువులు భౌతికంగా కనిపిస్తుండగా రికార్డుల్లో కనిపించడం లేదు. రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాలపై ఆరోపణలు వచ్చినా.. పేపర్లలో వార్తలు వచ్చినా.. అక్రమార్కులతో కుమ్మక్కై వారికి వంత పాడుతున్నారనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. అంతా తాము చూసుకుంటామని విచారణ పేరుతో కబ్జారాయుళ్లకు అనుకూలంగా ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నారనే చర్చలు వినిపిస్తున్నాయి.

'మదర్ డెయిరీ' ఎన్నికల షెడ్యూల్ విడుదల

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మూల్ మదర్ డెయిరీ)లో డైరెక్టర్ల ఎన్నికకు ఎలక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. సెప్టెంబర్ 30తో పదవీ కాలం ముగియనున్న మూడు స్థానాలు, గతంలో వాయిదా పడిన మరో మూడింటిని కలిపి మొత్తం ఆరు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇందులో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన రెండు రిజర్వ్ స్థానాలుంటాయన్నారు. సెప్టెంబర్ 4న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 5న మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అర్హత సాధించిన నామినేషన్ల ప్రకటన, 6న సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణ ఉంటాయని వివరించారు. సెప్టెంబర్ 13న హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మరుసటి రోజు ఫలితాలు వెల్లడించనున్నట్టు చెప్పారు. అనంతరం పాలక వర్గ సమావేశం ఉంటుందన్నారు.



తాండూరు టౌన్: ఉట్టి కొడుతున్న చిన్నారులు

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

జిల్లాలో శ్రీకృష్ణ జన్మాష్టమిని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. పాఠశాలల్లో, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టి సంబురాలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్

చెరువులో చేపల మృత్యువాత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని సూరమోని చెరువులో సోమవారం చేపలు మృత్యువాత పడ్డాయి. దూసకల్ శివారులోని చాక్లెట్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలను యాజమాన్యం బయటకు వదిలేస్తోంది. దీంతో అవి సమీపంలోని సూరమోని చెరువులోకి వెళ్తున్నాయి. చాక్లెట్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న అత్యంత ప్రమాదకరమైన వ్యర్థపదార్థాలు చెరువు నీటిలో కలుస్తుండడంతోనే చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చెరువులో లభించే చేపలపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని, చేపల మృతితో జీవనోపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ వదుతున్న రసాయనాలు, వ్యర్థాలతో చెరువు నీరు కాలుష్యంగా మారుతోందని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. చేపల మృతికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, జీవనోపాధిని కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



సూరమోని చెరువులో తేలియాడుతున్న చేపలు



మాట్లాడుతున్న బంగారు శృతి

సభ్యత్వ నమోదుపై దృష్టి

- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తాచాటుదాం
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

తాండూరు: సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పదాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శృతి మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగిందన్నారు. ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీనే అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకే పరిమితమవ్వకుండా స్థానిక సంస్థల్లోనూ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. వచ్చే పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలలో విజయదుందుభి మోగించాలన్నారు. గ్రామస్థాయి నుంచే పార్టీ సభ్యత్వాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ వివేకానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, రాంచందర్, కౌన్సిలర్ లలిత, బాలప్ప, శ్రీలత, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాయిరెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యత్వ నమోదు వలంటీర్లు పాల్గొన్నారు.

బీసీలను నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం

- చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ బిల్లు ప్రవేశపెడతామని రాజకీయ పార్టీలు ప్రకటన చేయాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కడ్తాల్: బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పిస్తామని.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడతామని.. చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పిస్తామని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మైసిగండి గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ అధ్యక్షతన సోమవారం రాష్ట్ర స్థాయి బీసీ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో 70 కోట్ల మంది బీసీ ప్రజల వాటా బీసీలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. బీసీలు బిచ్చగాళ్లు కాదు వాటాదారులని, వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతానికి పెంచుతామన్న హామీని నెరవేర్చాలని అన్నారు. కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కులు, సమస్యలపై త్వరలో కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో లక్షలాదిమంది బీసీలతో సభలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆలిండియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, బీసీ స్టూడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ రక్షక్ దళ్ నాయకుడు ఉదయ్‌నేత, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, బీసీ విద్యార్థి స్టేట్ కన్వీనర్ భాస్కర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: పట్టణంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు

ఇంద్రధనుస్సు కనువిందు

మబ్బులు కమ్మిన ఆకాశంలో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. సోమవారం సాయంత్రం జిల్లాలో కురిసిన వర్షానికి వికారాబాద్, ధారూరు మండల కేంద్రాల్లో ఆకాశం మేఘావృతమై ఇంద్రధనుస్సు ఏర్పడింది. దీంతో చూపరులు తన్మయత్వం చెందారు. దాదాపు 15 నిమిషాల పాటు ఈ ఇంద్రధనుస్సు నేత్రానందం కలిగించింది.



ధారూరు: బస్టాండు వద్ద..

నేడు తాండూరు ఆర్‌ఎంఓలతో ఫోన్ ఇన్



గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా తాండూరు ప్రభుత ఆస్పత్రి ఆర్ఎంఓ, మాతా శిశు ఆస్పత్రి ఆర్ఎంఓ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్లు: ఆనంద్ గోపాల్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి

తేదీ: 27-08-2024 (మంగళవారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
99492 61512, 93474 51474

న్యూస్‌రీల్

టీయూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ నియామకం

అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్–1 ప్రభుత్వ పాఠశాలలో సోమవారం టీయూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్, గౌరవ అధ్యక్షుడిగా బస్వరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. టీయూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయులకు, సంఘం సభ్యులకు ఏసమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలను నూతన ప్రభుత్వం చేపట్టిందని.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి భవనం కూల్చివేత



జేసీబీతో ఆస్పత్రి భవనం కూల్చివేత పనులు

కొడంగల్: పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని సోమవారం కూల్చివేశారు. ఇక్కడ అధునాతన వసతులతో కూడిన టీచింగ్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మండలంలోని అప్పాయిపల్లిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించనున్నారు. దీనికి అనుబంధంగా 220 బెడ్ల ఆస్పత్రి, టీచింగ్ కాలేజీ నిర్మిస్తారు. ఈనేపథ్యంలో పాత భవనాన్ని కూల్చివేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ బాబు

తుక్కుగూడ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. తుక్కుగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గౌరవ వేతనంతో పాటు రూ.300 కమీషన్ కూడా ప్రకటించాలన్నారు. నేటి నుంచి అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినాయక మండపాలకు డీజే అనుమతి లేదు

పెద్దేముల్ ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: వినాయక మండపాలకు డీజే అనుమతి లేదని ఎస్‌ఐ గిరి తెలిపారు. సోమవారం ఆయన ఠాణాలో మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా డీజేలను ఏర్పాటు చేస్తే సిస్టం యజమాని, వినాయక మండపం ఇన్‌చార్జిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వినాయక మండపానికి తప్పకుండా అనుమతి పొందాలన్నారు. వినాయక నిమజ్జనంలో అందరూ సామూహికంగా పాల్గొనాలని, ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

వేడుకకు వచ్చి.. గుండెపోటుకు గురై


రఫిక్ పాషా (ఫైల్)

దోమ: గుండెపోటుతో బొంపల్లి మాజీ ఉపసర్పంచ్ రఫిక్ పాషా(45) మృతి చెందారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన ఆదివారం ఓ గృహ ప్రవేశ కార్యక్రమానికి మండలంలోని స్వగ్రామానికి వచ్చారు. తిరిగి సోమవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో సిద్ధమవుతుండగా రఫిక్‌పాషా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాయి. వెంటనే కుటుంబ సభ్యులు పరిగి ఆసుపత్రికి తరలించినప్పటికీ వైద్యులు అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రఫిక్ పాషా బొంపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా ప్రజలకు సేవలందించి మన్ననలు పొందారు. ఆయన మృతి చెందడంతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనకు పదేళ్ల కుమార్తె ఉంది. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్, మశ్చేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఖాజపాషా, రాములు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో శుభ్రత ముఖ్యం

ఇన్‌చార్జి ఎంఈఓ హరిశ్చందర్


విద్యార్థులతో మాట్లాడుతున్న హరిశ్చందర్

పరిగి: వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి హరిశ్చందర్ పేర్కొన్నారు. సోమవారం పరిగి పట్టణ కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలు, కూరగాయలు, బియ్యం వంటి సరుకులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి మెరుగైన భోజనాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు రోగాల బారిన పడుతుంటారన్నారు. అందుకే పరిసరాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి నోట్‌బుక్స్, బెడ్‌షీట్స్, కార్పెట్స్ ఇవ్వాలన్నారు. చదువుపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులు మంచి ఫలితాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హాస్టల్ సిబ్బందిని హెచ్చరించారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక


ఆంజనేయులుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

షాబాద్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట్ ఆంజనేయులు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) కార్యాలయంలో రాధాకృష్ణ ప్రకటించి ఆహ్వానపత్రాన్ని ఆంజనేయులుకు అందజేశారు. మండలంలోని చర్లగూడ గ్రామానికి చెందిన ఆంజనేయులు ఈ అవార్డు రావడంతో సంతోషాన్ని వ్యక్త పరిచారు.


చెప్పులు చేత పట్టుకొని రోడ్డు దాటుతున్న మైసమ్మగడ్డ తండావాసులు (ఫైల్)


జానకంపల్లిలో బురదమయంగా రోడ్డు

గిరిజనం.. దారులతో సతమతం!

- తండాల్లో గుంతలమయంగా రహదారులు
- ఇబ్బంది పెడుతున్న బురద వీధులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

బురద దారులు, పంట పొలం బాటలు, ఎడ్లబళ్లు వేళ్లే మార్గాలు.. ఇవీ మండలంలోని గిరిపుత్రులు వినియోగిస్తున్న రహదారులు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దారులన్నీ బురదమయంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి దాపురించింది.

బొంరాస్‌పేట: దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మారుమూల పల్లెలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న తరుణంలో గిరిపుత్రులకు రవాణా వెతలు మాత్రం తీరడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షానికి కొన్ని గ్రామాలు, తండాలకు ప్రయాణ సౌకర్యం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మండలంలో 27 గిరిజన గ్రామ పంచాయతీలున్నాయి. వాటి పరిధిలో సుమారు 70కిపైగా గిరిజన తండాలున్నాయి. అందులో దాదాపు ఇరవై వేల మందికి పైగా నివసిస్తున్నారు. ఆయా తండాలకు వర్షం పడితే చాలు వాహనం వెళ్లేందుకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మరికొన్ని తండాలకు ఇప్పటివరకు రోడ్ల సౌకర్యమే లేదు. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లాలంటే అస్తవ్యస్తమైన రహదారులతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.

పిల్ల బాటలే రహదారులు

మండలంలోని లోతికుంటతండా, మైసమ్మగడ్డతండా, ఎక్కచెరువుతండా, బాపన్ చెర్వుతండా పరిధిలోని గిర్కబావితండా, భీక్యానాయక్‌తండా, ఉమ్లానాయక్‌తండా, మూడుమామిళ్లతండా పంచాయతీ పరిధిలోని బండమీదితండా, లింబ్యానాయక్‌తండా, పొల్కితండాలతోపాటు పలు గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం ఇప్పటివరకు లేదు. పంట పొలాల్లో ఉండే పిల్ల బాటలే వారికి రహదారులయ్యాయి. వర్షాలు కురిసే సమయంలో ఈ దారుల గుండా నడక నరకప్రాయంగా ఉంటుంది. విద్యార్థులు సైతం పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. గతంలో ప్రభుత్వ పెద్దలు తండాలకు రోడ్డు వేస్తామని హామీలు ఇచ్చినా.. శిలాఫలకాలకే పరిమితం అయ్యాయి.


ఊరెనికితండాకు వెళ్లే మట్టి రోడ్డుపై ప్రమాదకరంగా ప్రయాణం


దిప్పి బొమ్మల్లా డీప్లానయాక్‌తండా రోడ్డు శిలాఫలకాలు

పారిశుద్ధ్యం పడక

గ్రామాల్లో పారిశుద్ధ్యం కోసం ఏటా నిధులు మంజూరైనా పనులు జరిగిన ఆనవాళ్లు లేవు. డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్లు లేకపోవడంతో మురుగుతో వీధులన్ని నిండిపోతున్నాయి. మురికి, బురదతో వీధులు, రోడ్లు, తండాల ప్రయాణమార్గాలు దర్శనమిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అత్యవసరమైతే అవస్థలే



ఇప్పటి వరకు వాహనాలు వెళ్లడానికి వీలుకాని గిరిజన తండా మాదే. వానాలు కురిసి వాగులు పొంగి తండాలోనే మగ్గుతున్నాం. కాన్పు సమయాల్లోనూ తండా నుంచి గర్భిణిని చేతుల మీద తీసుకొచ్చి ఆస్పత్రికి చేరుస్తున్నాం. తండాకు రోడ్డు, వంతెన నిర్మించాలి.

– సూర్య, గిర్కబావితండా

రోడ్డు సౌకర్యం ఉండాలి



పంచాయతీ పరిధిలోని ఊరెనికితండా, భీక్యానాయక్‌తండా వరకు మట్టిరోడ్లు ఉన్నాయి. ఊరెనికితండా రోడ్డుకు రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాలి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావడానికి అవకాశం లేదు. అలాగే భీక్యానాయక్‌తండాకు రోడ్డును ఏర్పాటు చేయాలి.

– రతన్, మాజీ ఉపసర్పంచ్, ఊరెనికితండా

బాస్కెట్‌బాల్‌లో వికారాబాద్ జట్టు సత్తా


బాలుర విభాగంలో రన్నరప్‌గా నిలిచిన వికారాబాద్ జట్టు

- చాంపియన్లుగా హైదరాబాద్, మేడ్చల్
- ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అండర్–16 (యూత్) బాస్కెట్‌బాల్ టోర్నీలో చాంపియన్లుగా బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు, బాలికల విభాగంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్లు నిలిచాయి. బాల, బాలికల విభాగాల్లో వికారాబాద్ జట్లు రన్నరప్ స్థానాలను దక్కించుకోగా, మూడోస్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బాలుర విభాగం, బాలికల్లో రంగారెడ్డి జట్లు నిలిచాయి.

హోరాహోరీగా ఫైనల్

బాలుర, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఆయా జట్లు నువ్వానేనా అనే రీతిలో తలపడ్డాయి. ఉత్కంఠంగా చివరి వరకు సాగిన బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57–53 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై విజయం సాధించింది. అదేవిధంగా బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు 58–56 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మూడోస్థానం మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 50–40 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, బాలికల మూడోస్థానం మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 35–7 పాయింట్ల తేడాతో హైదరాబాద్ జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

ట్రోఫీలు అందజేసిన మున్సిపల్ చైర్మన్, డీఎస్పీ

టోర్నీలో విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి టోర్నీలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఐజాక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, కౌన్సిలర్లు రామ్, సాదతుల్లా హుస్సేనితోపాటు మీర్ అర్షద్అలీ, ఇలియాజ్, ఖాలెద్అలీ, ఖలీల్, సుబాన్‌జీ, ముకర్రం తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అడ్డుకోండి

పోస్ట్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు

తాండూరు: పట్టణంలోని ప్రధాన కూడలి సర్వే నంబర్ 130లో ఉన్న 36 గుంటల భూమిని అక్రమార్కుల పాలు కాకుండా రక్షించాలని తాండూరుకు చెందిన ఫార్మర్ కౌన్సిలర్ సూరజ్‌సింగ్‌ఠాకూర్ సోమవారం పోస్టల్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమి పట్టాదారులుగా షేరుబానుబాయి, అబ్దుల్ అజీజ్‌ల పేర్లు ఉన్నాయన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సదరు పట్టాదారులు పాకిస్తాన్‌కు వెళ్లిపోయారన్నారు. ప్రస్తుతం కాందిశీకుల భూమిగా పరిగణించాలి. కానీ కొందరు తామే అబ్దుల్ అజీజ్ వారసులమంటూ తప్పుడు పత్రాలు సృష్టించారని పేర్కొన్నారు. మరికొంత మంది తమకు సైతం హక్కు ఉందంటూ ఆక్రమించుకునే యత్నం చేస్తున్నారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి భూమి కాపాడాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మైసిగండి దేవాలయంలో పూజలు చేసిన శ్రీనివాస్

హైకోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్

ఆమనగల్లు/కడ్తాల్: భారత ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన న్యాయ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ హైకోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఆమనగల్లు మండలంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌తో కలిసి జూలూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జూలూరి శ్రీనివాస్‌కు ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాత చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలను తీసుకువచ్చిందన్నారు. నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్


నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశంగౌడ్

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడు ఈడిగి వెంకటేశంగౌడ్ అన్నారు. సోమవారం ఆయన కోట్‌పల్లి సమీపంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో వేసిన సిమెంట్ రోడ్లన్నీ కేంద్రం నిధులేనన్నారు. జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. ప్రతి మండలంలో గీత సెల్ కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు. గౌడ కులస్తులకు అండగా నిలిచి హక్కులు సాధించేలా ముందుకు సాగుతానన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అనంతరం గీత సెల్ వికారాబాద్ మండల అధ్యక్షుడిగా మొగులయ్యగౌడ్‌ను ఎన్నుకుని నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మాడపు బల్వలింగం నాయకులు ప్రసాద్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైతాప్‌ఖాన్‌గూడలో చెట్ల నరికివేత

విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని తొలగింపు


విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను నరికివేసిన సిబ్బంది

నవాబుపేట: ఒకరు మొక్కలు నాటితే.. మరొకరు నరికి వేస్తున్నారు.. హరితహారం చెట్ల పరిస్థితి దయనీయంగా మారింది. గత ప్రభుత్వంలో హరితహారం పేరుతో ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. అప్పుడే విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ప్రస్తుతం అవి పెరిగి వైర్లకు తగులుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ సిబ్బంది వైర్లకు తాకుతున్నాయని ఆ చెట్లను నరికి వేస్తున్నా రు. మండల పరిధిలోని మైతాప్‌ఖాన్‌గూడలో కిలోమీటర్ పొడవునా విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను రెండు రోజులుగా సిబ్బంది నరికి వేస్తోంది. ఇన్నాళ్లు పెంచిన మొక్కలను నరకడం ఏంటని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. మొక్కలు నాటేటప్పుడే అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని మండిపడుతున్నారు.

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- హైడ్రాను షాద్‌నగర్‌కు తెచ్చేందుకు సీఎంకు విజ్ఞప్తి చేస్తా

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా విధానాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సాహసోపేతమైన నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారన్నారు. అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారి రంగనాథ్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనూ అనేక చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. వికారాబాద్ నుంచి నియోజకవర్గంలోని రెడ్డిపాలెం వరకు ఉన్న ఫిరంగి నాలాను కొందరు ధ్వంసం చేసి అక్రమ కట్టడాలు చేపట్టారన్నారు. దీంతో నీటి వనరులు ప్రజలకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్‌లోని బొబ్బిలిచెరువు భూమి ఆక్రమణకు గురైందని, ఆ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకుల స్వార్థం, రియల్ వ్యాపారుల లాభాపేక్షతో అక్కమ్మ చెరువు, అంచుకుంట చెరువు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. షాద్‌నగర్‌కు హైడ్రాను తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానన్నారు. అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జగదీశ్వర్‌అప్ప, వీరేశం, హరినాథ్‌రెడ్డి, సయ్యద్‌ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం సాగక.. పడిగాపులు!


కొత్తూరులో వై జంక్షన్ కూడలిలో నిలిచిన ట్రాఫిక్


పెంజర్ల కూడలి వద్ద క్యూ కట్టిన వాహనాలు

- ఎన్‌హెచ్‌–44పై కొత్తూరు–శంషాబాద్ మార్గంలో ట్రాఫిక్ కష్టాలు
- పలు కూడళ్ల వద్ద తరచూ నిలిచిపోతున్న వాహనాలు
- అత్యవసరంగా వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు

కొత్తూరు: అది దేశంలోనే అత్యంత పొడవైన జాతీయ రహదారి.. నిత్యం ఈ రోడ్డు గుండా వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.. మంత్రులు, వీవీఐపీలు తరచూ ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అంతటి ముఖ్యమైన ఎన్‌హెచ్–44 రహదారిలో కొత్తూరు నుంచి శంషాబాద్ వరకు తరచూ ట్రాఫిక్ జాం అవుతుండడంతో వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఓ వైపు రహదారి విస్తరణ పనులు మరోవైపు పెరిగిన వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ జాం ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఇబ్బందులు తప్పడం లేదు.

వీటితో నిత్యం ట్రాఫిక్ జాం

- శంషాబాద్ మండలం తొండుపల్లి వద్ద గతేడాది నుంచి వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నారు. అసలే ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండడం.. దానికి తోడు వంతెన పనులు జరుగుతుండడంతో విపరీతమైన ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఒక్కోసారి వంతెనకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.
- శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న దర్గాను దర్శించుకోవడానికి భక్తులు వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. దీంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది.
- కొత్తూరు నుంచి శంషాబాద్ వచ్చే రోడ్డులో మదనపల్లితాండ వద్ద వాహనాలు యూటర్న్ తీసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి.
- కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తా, చేగూరు రోడ్డులో వాహనాలు యూటర్న్ తీసుకుంటాయి. ఈ కూడళ్లలో కూడా రోడ్డు ఇరుకుగా ఉండడంతో వెనకాల నుంచి వచ్చే వాహనాలు ముందుకు వెళ్లలేక ట్రాఫిక్ జాం అవుతుంది.
- ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు కొత్తూరు పట్టణంలోని జాతీయ రహదారి వై జంక్షన్ కూడలిను మూసివేశారు. దీంతో షాద్‌నగర్‌కు వెళ్లే వాహనాలు పెంజర్ల రోడ్డులో యూటర్న్ తీసుకుని పట్టణం గుండా వెళ్లాల్సి వస్తుంది. దీంతో పెంజర్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుంది.

అత్యవసర సమయాల్లో అవస్థలు

కొన్ని నెలలుగా కొత్తూరు–శంషాబాద్ వరకు జాతీయ రహదారిపై ఎప్పుడు, ఎక్కడ ట్రాఫిక్ జాం ఏర్పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు రోగులను తరలించే అంబులెన్సులు ఇరుక్కుపోతున్నాయి. ఆయా పనుల నిమిత్తం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలు, ప్రజలు ట్రాఫిక్ జాం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కూడళ్లలో నెమ్మదిగా వాహనాలు కదిలే సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం

కొత్తూరు–శంషాబాద్‌కు వరకు ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పలు కూడళ్ల వద్ద రోడ్డు ఇరుకుగా మారింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. మదన్‌పల్లి దర్గా వద్ద రోడ్డుపై భక్తుల వాహనాలు పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియంత్రణ పాటించాలి.

– నాగభూషణం, ట్రాఫిక్, ఏసీపీ, శంషాబాద్